ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 11 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 మంగళవారం
సహర్ 5:06 బుధవారం



అట్రాసిటీ కేసుల్లో ఎస్సీ, ఎస్టీలకు పరిహారం పంపిణీ

- 46 మందికి రూ.36,87,500 బ్యాంక్ ఖాతాల్లో జమ : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసుల కింద నష్టపరిహారం పంపిణీ చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో నమోదైన ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ కేసుల ఆధారంగా మొత్తం 46 మందికి రూ.36,87,500 పరిహారం వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం ప్రకారం ముస్తాబాద్ మండలంలో 3, కోనరావుపేట మండలంలో 6, వేములవాడ అర్బన్, రూరల్ మండలంలో 12, సిరిసిల్ల మండలంలో 5, చందుర్తి మండలంలో 3, బోయినపల్లి మండలంలో 4, తంగళ్లపల్లి మండలంలో 5, గంబీరావుపేట మండలంలో 2 ఎల్లారెడ్డిపేట మండలంలో 2, ఇల్లంతకుంట మండలంలో 3, జగిత్యాల జిల్లాలో ఒకరికి పరిహారం పంపిణీ చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో వివరించారు.

జిల్లా పంచాయతీ అధికారిగా షర్ఫొద్దీన్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీ అధికారిగా షర్ఫొద్దీన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఆయన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి విధుల్లో చేరారు. జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసిన అధికారి సెలవుపై వెళ్లిపోవడంతో ఆ స్థానంలో హన్మకొండ జిల్లా పరకాల డివిజనల్ పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న షర్ఫొద్దీన్‌కు పదోన్నతితో రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత



వైద్యసేవలను ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

ఇల్లంతకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆరోగ్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి రజిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యసేవలను సోమవారం పల్లె దవాఖానలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు పోతోందన్నారు. కమ్యూనిటీ సెంటర్ అందుబాటులోకి వచ్చే వరకు ప్రజలు ఇబ్బంది పడవద్దని పల్లె దవాఖానాలో సేవలు అందిస్తామన్నారు. వైద్యసిబ్బంది, గ్రామాలలో ఆశా కార్యకర్తలు సమయపాలన పాటించి, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవో డాక్టర్ సంపత్‌కుమార్, మండల వైద్యాధికారి జీవనజ్యోతి, సూపర్‌వైజర్ రమణప్రసాద్‌లతో పాటు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన

ఎల్లారెడ్డిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ స్థాపన, ప్రాణప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర పూజలను జరిపించారు. వేదపండితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలోని పురోహితులు సాయి భరద్వాజ్‌శర్మ, వాసుశర్మ, రాముశర్మ, రక్షిత్‌శర్మ, నందకిషోర్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, రామచంద్రశర్మ, నిఖిల్‌శర్మ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన చేపట్టారు. అనంతరం మడేలేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. మహిళలు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, రజక సంఘం నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు త్వరలో కొత్త సారథులు



- స్వయం సహాయక సంఘాల్లో ఎన్నికల సందడి
- కొత్త బైలా ప్రకారం ఎన్నికలు.. సిబ్బందికి శిక్షణ
- ఎస్‌హెచ్‌జీలో 10 నుంచి 12 మంది పాలకవర్గ సభ్యులు
- జిల్లాలో 9854 సంఘాలు.. 115656 మంది సభ్యులు

జిల్లాలో సంఘాలు, సభ్యులు..

మండలం	సంఘాలు	సభ్యులు
బోయినపల్లి	816	9,655
చందుర్తి	760	9,100
ఇల్లంతకుంట	1,122	13,206
గంబీరావుపేట	1,155	12,802
కోనరావుపేట	1,035	12,107
ముస్తాబాద్	1,210	14,182
రుద్రంగి	386	4,510
తంగళ్లపల్లి	1,100	12,447
వీర్నపల్లి	346	4,023
వేములవాడ	413	4,784
వేములవాడ రూరల్	495	5,888
ఎల్లారెడ్డిపేట	1,170	12,852
మొత్తం	**10.008**	**1.15.656**

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మహిళా స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకోవడానికి కసరత్తు ప్రారంభమైంది. దీంతో మహిళా సంఘాల్లోనూ ఎన్నికల సందడి మొదలైంది. మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు మహిళా సంఘాల సభ్యులకే ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ఎన్నికలు కూడా కీలకంగానే మారాయి. స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. నూతన తెలంగాణ పరస్పర సహాయ సహకార సంఘాల(మ్యాక్స్) చట్టం ప్రకారం సవరించిన బైలా ప్రకారం కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న చట్టం ప్రకారం ఏర్పాటైన మహిళా సంఘాల కమిటీలు రద్దు కానున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సంఘాల ఎన్నికల కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల అధ్వర్యంలో మండల, ఏపీఎం, సీసీలకు ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో ఇప్పటికే శిక్షణ కూడా అందించారు. ఈ నెలాఖరులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాచరణ రూపొందించనుంది. మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్‌ల నుంచి ప్రభుత్వం వివిధ పథకాలద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. బ్యాంక్ లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లింపులు చేస్తున్నారు. గ్రామైక్య సంఘంలో పొదుపు, స్త్రీనిధి, కమ్యూనిటీ ఇన్వెస్టిమెంట్ రుణం, మహిళా శక్తి అభివృద్ధి రుణం, వాటర్‌షెడ్ రుణాలు వంటివి సమర్థవంతంగా నిర్వహించడంలో..

మిగతా 8లో

మట్టి కుండ.. సల్లగుండ..

- రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి ప్రత్యేక రంజన్లు



సిరిసిల్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సిరామిక్ రంజన్లు

6

బీసీలకు అవకాశం కల్పించడం అభినందనీయం

- మంత్రి పొన్నం ప్రభాకర్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్

7

న్యూస్ బాక్స్

సమస్య పరిష్కారం అయ్యేవరకు ఉద్యమిస్తాం

ఇల్లంతకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ పనులు పూర్తిచేసి నీరు అందించే వరకు ఉద్యమిస్తామని రైతులు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామసమీపంలో ఎల్ఎమ్ 6 కాలువ పనులు పూర్తిచేయాలని రైతులు చేపట్టిన నిరాహారదీక్ష సోమవారానికి 8వ రోజుకు చేరుకుంది. రెండు మండలాల రైతులు నిరాహారదీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. రైతుల దీక్షకు మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గొట్టిపర్తి పర్శరాం సంఘీభావం ప్రకటించారు.

కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ చట్టాలను ప్రతిఒక్కరు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. సిరిసిల్ల ఇన్‌చార్జ్ ఆర్డీవో రాధాబాయి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, రాష్ట్ర కార్య దర్శి జనపాల శంకరయ్య, దొంత దేవదాస్, అంకారపు జ్ఞానోభా,విశృతి ముత్తయ్యగౌడ్, రాపెల్లి ముకుందం పాల్గొన్నారు.

మూల్యాంకనం డబ్బులు చెల్లించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకన డబ్బులు చెల్లించకుంటే స్పాట్‌ను బహిష్కరిస్తామని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బోయ్యన్నగారి నారాయణలు అన్నారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం సూపరింటెండెంట్ భూపతిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షల విధులు నిర్వహించిన ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్స్, ఇతర విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు రెమ్యూనేషన్ చెల్లించకుంటే ఈ సంవత్సరం జరిగే స్పాట్‌ను బహిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల మండల అధ్యక్షుడు పోతుగంటి రమేష్, ఎల్లారెడ్డిపేట మండల బాధ్యుడు పులి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సిరిసిల్ల రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 3719మంది విద్యార్థులకు 3658 మంది హాజరుకాగా 61 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 3345మంది విద్యార్థులకు 3295 మంది విద్యార్థులు హాజరుకాగా 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 374 మంది విద్యార్థులకు 363 మంది విద్యార్థులు హాజరుకాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సమర్థవంతంగా సాగునీరందించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రబీలో పంటలు కాపాడే నేపథ్యంలో ప్రాజెక్ట్‌ల నుంచి విడుదల చేసే సాగునీటిని సమర్థవంతంగా అందించడంతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. నీరు లేక పంటలు ఎండిపోతున్నట్లుగా తెలుస్తుందని ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు పరిశీలించి కలెక్టర్‌కు నివేదికలు అందిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు లేక పంటలు ఎండిపోవడాన్ని తగ్గించాలని అన్నారు. రాష్ట్రంలో నీటి కొరత ఉన్నందున నీటి సరఫరాను సమర్థవంతంగా పంపిణీ చేసేందుకు నీటి పారుదల, రెవెన్యూ, శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కలెక్టర్ వ్యవసాయం, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంట నష్టాలను తగ్గించాలని అధికారులు, క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. సాగునీరు సరఫరా కాలువల ద్వారా చేరని ప్రాంతాల్లో నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేసి పంటలకు నీరు అందేలా చూడాలని అన్నారు. రాబోయే 15 రోజుల్లో నీటి పారుదల శాఖ అధికారులతో అవసరమైన నీటి విడుదలను కట్టుదిట్టంగా చేస్తూ పంటలను కాపాడే బాధ్యతలను కలెక్టర్ తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం, బోర్లు ఎండి పోవడం వల్ల ఎక్కడైనా సాగునీటి ఇబ్బందులు ఉన్నాయో పరిశీలించాలని అన్నారు. పంటలు కోతకు వచ్చే వరకు వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు నీటి పారుదల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కమార్ ఝా, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఇరిగేషన్ ఈఈ కిషోర్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌భేగం, జిల్లా ఉద్యానవన అధికారి లత, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేవరకు ఫలితాలు నిలిపివేయాలి

- ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆవునూరి ప్రభాకర్ మాదిగ



రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్1, 2, 3 పరీక్షల ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆవునూరి ప్రభాకర్ మాదిగా డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఈ దీక్షలకు ముఖ్య అతిథిగా హాజరైన నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఎదుట, మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలను చేపట్టినట్లు తెలిపారు. దీక్షల్లో మాదిగ కులస్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్‌మాదిగ, అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, కో-కన్వీనర్ సావనపెల్లి రాకేష్, దండోరా కళామండలి జిల్లా ఉపాధ్యక్షుడు పనుల దుర్గయ్య, మండలాల అధ్యక్షులు సావనపెల్లి బాలయ్య, కొమ్ము రాజశేఖర్, తర్రె శంకర్, శరవింద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సావిత్రీబాయి పూలే వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతీలాల్, ఉపాధ్యాయులు కుమ్మరి మల్లేశం, పాతూరి మహేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గోవిందరావు, నసీరోద్దీన్, దేవత ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, గుండారం, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో సావిత్రబాయి పూలే వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ముఖేష్, ఉపాధ్యాయులు కోరెపు శ్రీనివాస్, చింతల హరిష్మా, యాస నవ్య, మాధవి పాల్గొన్నారు.

ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మహేశ్. బి. గితేను సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, పాత్రికేయులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు అక్కరాజ్ శ్రీనివాస్, సిరిసిల్ల టౌన్ మున్నూరుకాపు అధ్యక్షుడు అగ్గి రాములు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రేంరెడ్డి, దేవేందర్ తదితరులు ఎస్పీని కలిశారు.

ట్యాంకర్లతో పంట పొలానికి నీరు

వీర్నపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : భూగర్భజలాలు తగ్గడం, బోర్లు ఎండిపోవడం, విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో అన్నదాతలు తల్లడిల్లిపోతున్నారు. వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన యువ రైతు బైరి సాయి రెండు ఎకరాలలో సాగుచేసిన వరి పంట పొట్ట దశలో ఎండిపోతుండటంతో పంటను కాపాడుకునేందుకు రోజుకు 8ట్యాంకర్ల నీరు పోస్తూ పడరాని పాట్లు పడుతున్నాడు.



మట్టి కుండ.. సల్లగుండ..

రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి ప్రత్యేక రంజన్లు



సిరిసిల్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాజస్థాన్ రంజన్లు

సిరిసిల్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఈసారి తొందరగానే మండిపోతున్నాడు. ఏప్రిల్, మేలో భగ్గుమనే భానుడు తన ప్రతాపాన్ని చూపించేవాడు. ఇప్పుడు మార్చిలోనే తన పనిని మొదలు పెట్టేశాడు. ఎండ దాహాన్ని తీర్చుకోవడానికి మట్టి రంజన్లను ఆశ్రయిస్తున్నారు. పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన ఆదిలాబాద్ రంజన్లకు పోటీగా ఈసారి గుజరాత్ రాజస్థాన్‌ల నుంచి ఎక్కువగా రంజన్లు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌కు చెందినవారే నేరుగా సిరిసిల్లకు తీసుకవచ్చి అమ్మకాలు సాగిస్తుండడంతో స్థానికంగా సీజనల్ వ్యాపారాలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రంజన్లతో పాటు మట్టి కూజాలు, వంట చేసుకునే మట్టి పాత్రలు కూడా వచ్చాయి. రాజస్థాన్ నుంచి వచ్చిన రంజన్లకు నల్లాలతో పాటు రకరకాల డిజైన్లు ఉండడం, ధర అందుబాటులోనే ఉన్నాయి. రాజస్థాన్ రంజన్లు రూ.150 నుంచి రూ.350 వరకు ఉన్నాయి. మరోవైపు గుజరాత్ నుంచి మట్టి రంజన్లతో పాటు సిరామిక్ రంజన్లు వచ్చాయి. సిరామిక్ రంజన్లు నీటి చల్లదనం ఎక్కువగా ఉంటుందని భావించి కొనుగోలు చేస్తున్నారు. ఈ రంజన్లు రూ.250 నుంచి రూ.500 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. గుజరాత్, రాజస్థాన్‌ల నుంచి ప్రత్యేక కంటైనర్ల ద్వారా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి దిగుమతి చేసుకున్నారు. ఇక్కడి నుంచి మండలాలకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నారు.



రంజన్లు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

● వృద్ధురాలు మృతి ● మరొకరికి స్వల్పగాయాలు

గన్నేరువరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలం లోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి ఓవర్ స్పీడుతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న వృద్ధురాలు బొంగాని రాజమ్మ(88) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బొంగాని రాజమ్మకు బొంగాని మొగిలయ్య, బొంగాని మల్లయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిరువురు తనతల్లిని వంతులవారీగా చూసుకుంటున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పెద్దకొడుకు మొగిలయ్య మందమర్రిలో తన తమ్ముడివద్ద ఉన్న తల్లిని తీసుకరావడానికి తన కొడుకు అనిల్‌కుమార్‌ను మందమర్రికి పంపించాడు. ఆదివారం మందమర్రి నుంచి నానమ్మ రాజమ్మను ఏపి11ఏపి0960 నంబర్ గల కారులో ఎక్కించుకొని అనిల్ కుమార్ హైదరాబాద్ బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని గుండ్లపల్లి స్టేజివద్దకు రాగానే ఓవర్‌స్పీడు వల్ల వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌కు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాజమ్మకు తీవ్రగాయాలు కాగా మనవడు అనిల్ కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే అనిల్‌కుమార్ స్థానికుల సహాయంతో రాజమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. మనవడు బొంగాని అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాధాకిషన్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రామగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన బోనగిరి నర్సయ్య(47)అనే వ్యక్తి సోమవారం బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న నర్సయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కట్టరాజీరుకు చెందిన వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఈత రాని కారణంగా ఉపిరి ఆడక పోవడంతో మృతి చెందాడు. భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జీ దగ్గర కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరి రాజయ్య, గూడూరి కొండాల్‌రెడ్డి కారులో కరీంనగర్‌కు వెళ్లి హుజూరాబాద్‌కు వస్తున్నారు. తాడికల్ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చల్లూరి రాజయ్య, కొండాల్‌రెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మం డలం లోని తాడికల్ గ్రామంలో సోమవారం ఉదయం వీధి కుక్క దాడిలో మూడేళ్ల బాలుడు తీవ్రంగా గాయప డ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కర్నాల కృత్విక్ అనేబాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గాయపడిన బాలుడు కృత్విక్

మద్యానికి బానిసై ఒకరి మృతి

కరీంగనర్ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వేనిగంటి నాగరాజు (35)మద్యానికి బానిసగా మారి డీహైడ్రేషన్‌తో మృతి చెందాడు. మూడోటౌన్ పోలీసుల వివరాల ప్రకారం... హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నాగరాజు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. దీంతోభార్య పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న నాగరాజు సరిగా ఆహారం లేకపోవడం, మద్యానికి బానిసైమత్తులో ఉండడంతో డీహైడ్రేషన్‌కు గురై మరణించాడు. నాగరాజు తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులూ.. ఇస్రో పిలుస్తోంది



● తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం

● యువిక-25 కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానం

● దేశ వ్యాప్తంగా నిర్వహణ

చొప్పదండి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువిక)ను నిర్వహిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టబోయే ఈ కార్యక్రమం కోసం తొమ్మిదో తరగతి విద్యార్థులను ఇస్రో ఆహ్వానిస్తోంది. అంతరిక్ష పరిశోధనలో ఇటీవల ఇస్రో 100ప్రయోగాలు పూర్తి చేసుకొని అగ్ర దేశాలకు దీటుగా పరిశోధనలను చేపడుతుండగా ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తిని నింపేం దుకు ఇస్రో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

23 వరకు గడువు

విద్యార్థులు మార్చి 23వరకు www.isro.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను వడపోసిన అనంతరం ఏప్రిల్ 7న 337 మంది విద్యార్థులను ఎంపిక చేసి జాబితాను విడుదల చేస్తారు. మే 18 నుంచి విద్యార్థులను కార్యక్రమానికి ఆహ్వానిస్తారు. మే 19నుంచి 30 వరకు యువిక-25 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మే31 తేదీన ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు.

విద్యార్థులకు అన్నీ ఉచితమే

ఇస్రో నిర్వహించే యువిక కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలను ఇస్రో ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14రోజులు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, గ్రహాలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడేఅవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

విద్యార్థుల అర్హత

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులకు 50శాతం వెయిటేజ్ ఇస్తారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లలో విద్యార్థులు ఉంటే ఐదుశాతం, జిల్లా, రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 10శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే ఐదు శాతం, పల్లెప్రాంతాలకు చెందిన విద్యార్థులకు 20శాతం ప్రాధాన్యత కల్పిస్తారు.





దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో యువిక నిర్వహణ

ఇస్రో యువిక-25 కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఏడుకేంద్రాల్లో నిర్వహిస్తోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్, కేరళలోని తిరువనంతపురం, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, కర్ణాటకలోని బెంగళూరు, గుజరాత్‌లోని అహ్మదాబాద్, తెలంగాణలోని హైదరాబాద్, మేఘాలయ రాష్ట్రంలోని షిల్లాంగ్‌లో నిర్వహిస్తోంది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై విద్యార్థి ఆత్మహత్య

తిమ్మాపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లికి చెందిన సిరికొండ నిఖిల్‌రావు (22) అనేవిద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొని అప్పులపాలై ఆతహత్యకు చేసుకున్నాడు. మన్నెంపల్లి గ్రామానికిచెందిన సిరికొండ తిరుపతి రావు కుమారుడు నిఖిల్‌రావు హైదారాబాద్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ మూడోసంవత్సరం చదువుతున్నాడు. ఈనెల7న హైదారాబాద్ నుంచి మన్నెంపల్లికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు వెళతానని చెప్పడంతో అతడి తండ్రి కరీంనగర్ బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. 4.45కి తండ్రికి ఫోన్‌చేసి తాను హైదరాబాద్ బస్సు ఎక్కానని చెప్పాడు. ఉదయం 11.45గంటల సమయంలో తిరుపతిరావు వద్ద పనిచేసే శంకర్ పొలానికి నీళ్లపెట్టి మోటర్‌బంద్ చేయడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి గట్టుమీద చెప్పులు, కర్చీఫ్ కనిపించాయి. అనుమానం వచ్చిన శంకర్ బావిలోకి తొంగిచూడగా నిఖిల్‌రావు మృతదేహం కనిపించింది. వెంటనే శంకర్ తిరుపతి రావుకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిఖిల్ రావు మృతదేహాన్ని బయటకు తీయించారు. నిఖిల్‌రావు కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

● ఆన్‌లైన్ బెట్టింగే కారణం..

హైదారాబాద్‌లో చదువుకుంటున్న నిఖిల్‌రావు కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. గతంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నిఖిల్‌రావు ఐదు లక్షల వరకు పోగొట్టుకున్నాడు. అతడి తండ్రి ఆ అప్పులు చెల్లించి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడవద్దని మందలించాడు. అయినా తీరు మార్చుకోని నిఖిల్‌రావు తిరిగి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి మళ్లీ డబ్బులు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు కట్టాల్సిందిగా ఇంట్లో అడిగాడు. ఇక తమవల్ల కాదని, చదువుకు మాత్రం డబ్బులు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పులతో ఇబ్బంది పడుతున్న నిఖిల్‌రావు మనస్థాపానికి గురై హైదారాబాద్ వెళ్లలేక, మధ్యలోనే బస్సు దిగి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.



నిఖిల్ రావు (ఫైల్)

ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమశేఖర చిట్ ఫండ్స్ కార్యాలయం ఫర్నీచర్ ధ్వంసం చేసి, తనను నోటికి వచ్చినట్లు దుర్భాష లాడాడని బాధితుడు గూడెం నరేందర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మేడదుల సతీష్ అనేవ్యక్తి సోమశేఖర చిట్‌ఫండ్‌లో రూ.10లక్షల చిట్టి వేశాడు. డబ్బులు మొత్తం కట్టకపోవడంతో రిమైండ్ నోటీస్ పంపించారు. నోటీస్ ఎందుకు పంపా రంటూ తీవ్ర ఆగ్రహానికి గురైన సతీష్ చిట్‌ఫండ్‌కు వెళ్లి మేనేజర్ క్యాబిన్ గ్లాస్ ధ్వంసం చేశాడు. నోటికి వచ్చినట్లు దుర్భా షలాడాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

రుద్రంగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మానాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు రుద్రంగిలోని పెట్రోల్ పంప్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న సిబ్బంది ఈఎంటి వెంకట రమణ, పైలట్ చాణక్యలు తీవ్రగాయాలైన శ్రీకాంత్‌కు ఫస్ట్ ఎయిడ్ చేసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన దర్శనాల కరుణాకర్, ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి మల్లయ్యల ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కరుణాకర్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ చల్మెడ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మల్లయ్యకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం సిరిసిల్ల తర లించారు.

30 ఏళ్ల తర్వాత తల్లిని కలిసిన తనయ

● ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టు వసంత

● పోలీసుల సమాచారంతో తల్లిని కలిసేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్లిన కూతురు

కోరుట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండల సిరికొండ గ్రామానికి చెందిన మావోయిస్టు వసంత అలియాస్ శాంతక్కఅలియాస్ మమతక్కను 30సంవత్సరాల తరువాత ఆమె కూతురు భవాని కలిసింది. అనారోగ్య కారణాలతో పోలీసులకు లొంగిపోయిన ఛత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌కమిటీ సభ్యురాలు వసంతను ఆమె కూతురు భవాని కాంకేర్‌కు వెళ్లి సోమవారం కలిసింది. 2024 నవంబర్‌లో కాంకేర్ పోలీసులు ఆమెతోపాటు మరో ఏడుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. ప్రస్తుతం వసంత మోకాళ్లనొప్పులు, షుగర్‌వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు వసంత గురించి ఆరాతీసి తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నాలుగు రోజుల క్రితం తెలంగాణ పోలీసులు భవాని ఆచూకీ తెలుసుకొని ఆమెతల్లి సమాచారాన్ని చేరవేశారు. ప్రస్తుతం వసంత కూతురు భవాని ప్రేమవివాహం చేసుకొని భూపాలపల్లి జిల్లా పరకాలలో ఉండడంతో కోరుట్ల పట్టణంలోని ఆమె బంధువులకు విషయం తెలియజేశారు. దీంతో స్పందించిన బంధువులు భవానితో కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ప్రత్యేక వాహనంలో వెళ్లారు. దీంతో అక్కడి పోలీసు ఉన్నతాధికారులు విచారణచేపట్టి వారికి సంబంధించిన పత్రాలను స్వీకరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు వారికి తెలిపారు.

● భర్త ఎన్‌కౌంటర్‌లో మృతి..

వసంతభర్త రాంరెడ్డి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినా అజ్ఞాతం వీడి జనజీవనంలోకి రాలేదు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన రాంరెడ్డి 1979లో పీపుల్స్‌వార్‌లో చేరాడు. అప్పుడు పోలీసులు రాంరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలునుండి వచ్చిన అనంతరం కథలాపూర్ మండల సిరికొండ గ్రామనికి చెందిన వసంతతో వివాహం జరిగింది. అనంతరం దంపతులిద్దరూ పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరికికూతురు భవాని జన్మించింది. అనంతరం రాంరెడ్డి-వసంత దంపతులు కూతురును ముంబాయిలో ఉన్న సోదరుడు సాయిబాబకు అప్పగించారు. పసుల రాంరెడ్డి 2001లో ఉత్తర తెలంగాణ స్పెషన్ కార్యదర్శి హోదాలో ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లా ఎలారెడ్డిపేట మండలం మదిమల్ల సమీనంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్న వసంత కాంకేర్ పోలీసుల అదుపులో ఉంది.



పోలీసుల అదుపులో ఉన్న వసంత (ఫైల్)



భవాని

పోచమ్మవాడలో ఒకరి హత్య?

● కుళ్లిన స్థితిలో మృతదేహం

● రెండు రోజుల కిందటే ఘటన

● స్నేహితుడే నిందితుడిగా అనుమానాలు?

కరీంనగర్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన బాలసాని రాము(41) మృతదేహన్ని సోమవారం స్థానిక పోచమ్మవాడలోని ఒకగదిలో కుళ్లిన స్థితిలో పోలీసులు గుర్తించారు. రాము హత్యకు గురైనట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన బాలసాని రాము లక్ష్మీనగర్‌లో భార్య, పిల్లలతో నివాసం ఉంటూ కమాన్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కన కర్రీపాయింట్ నిర్వహిస్తున్నాడు. రాము భార్య లతశ్రీ ఈనెల 5న సంగారెడ్డిలోని తన పుట్టింటికి కూతురుతో కలిసి వెళ్లింది. రాము, అతడి కుమారులు లక్ష్మీనగర్‌లోనే ఉన్నారు. శనివారం రాత్రి 8 గంటలకు సంతోష్ అనేవ్యక్తి రాముకు ఫోన్‌చేశాడు. వెంటనే బైక్‌పై పోచమ్మవాడలోని సంతోష్ వద్దకు వెళ్లాడు. అప్పటి నుంచి రాము తిరిగి లక్ష్మీనగర్‌లోని తన ఇంటికి చేరలేదు. ఈ విషయం మృతుడి కొడుకు తన తల్లి లతశ్రీకి ఫోన్‌లో చెప్పాడు. సంగారెడ్డిలో ఉన్న ఆమె పలుమార్లు రాముకు ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అనుమానించి సోమవారం కరీంనగర్‌కు చేరుకుంది. తన భర్త రాము శనివారం రాత్రి నుంచి కనిపించడం లేదని, అతడి స్నేహితుడు సంతోష్ ఫోన్ చేయగా వెళ్లాడని తెలిపింది. కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు పోచమ్మవాడ లోని సంతోష్ ఇంటికి వెళ్లి తాళం పగులగొట్టి చూశారు. రాము మృతదేహం ముఖం, తల, కాలిపైగాయాలతో రక్తపు మడుగులో కుళ్లినస్థితిలో ఉంది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించగా సంతోష్ మృతుడి బైక్ తీసుకొని కోతిరాంపూర్‌లోని ఒక వైన్‌షాపు వద్దకు చేరుకున్నట్లు, అక్కడ మద్యం కొనుగోలు చేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. మృతుడి బైక్ వైన్‌షాపు వద్ద పార్క్ చేసి ఉంది. సంతోష్ సిద్దిపేట జిల్లాలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తుండగా ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిపై గతంలో కరీంనగర్‌లో ఒక పోక్సో కేసు కూడా నమోదైనట్లు తెలిసింది. రాము భార్య లతశ్రీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




రాము(ఫైల్)

సెలూన్ షాపు దగ్ధం

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ క్రాస్‌రోడ్‌వద్ద ఓ సెలూన్‌షాపులో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. మొలంగూర్ గ్రామానికిచెందిన విజ్జిగిరి శివ నాగేంద్ర కొన్నిరోజులక్రితం క్రాస్ రోడ్ వద్ద సెలూన్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు సెలూన్‌షాపునకు తాళం వేసి ఇంటికివెళ్లాడు. అర్ధరాత్రి సెలూన్‌లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి శివనాగేంద్రకు సమాచారం అందించారు. వెంటనే శివనాగేంద్ర సెలూన్ వద్దకు చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపకసిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అప్పటికే సెలూన్‌లోని సుమారు లక్ష రూపాయల విలువచేసే సామగ్రి దగ్ధమైంది.

సంఘటనపై కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శివనాగేంద్ర తెలిపారు.



దగ్ధమవుతున్న సెలూన్ షాప్

పేకాట స్థావరంపై దాడి

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామశివారులో స్థావరంపై దాడిచేసి నగదును స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా, నలుగురు తప్పించుకున్నారని, నిందితులపై కేసు నమోదు చేసి రూ.4400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కమాన్‌పూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద పెద్దపల్లి, మంథని ప్రధానరహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన దొంతుల వాణి (49)అనే మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. బైకుపై భార్యభర్తలు కల్వచర్ల నుంచి కమాన్‌పూర్ వెళ్తున్న క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్‌సీఐ ప్రసాద్‌రావు, ఎస్సై కొట్టె ప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. భర్త దొంతుల సురేష్ ఫిర్యాదు మేరకు మృతదేహనికి పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్టీపీసీ రక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

● సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్

జ్యోతినగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రక్షణలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యురిటీఫోర్స్ (సీఐఎస్ఎఫ్) పాత్ర కీలకమని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం (రైజింగ్ డే) సందర్భంగా సోమవారం సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఈడీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టుల రక్షణతో పాటు ఉద్యోగులను నిత్యంసీఐఎస్ఎఫ్ జవానులు రక్షిస్తున్నారన్నారు. సంస్థ ఆస్తులను కాపాడడం, అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నదన్నారు. పారిశ్రామిక ఆస్తుల రక్షణకోసం ఏర్పడిన సీఐఎస్ఎఫ్ పారా మిలిటరీగా మారి 50ఏళ్లకుపైగా అనేక కేంద్ర ప్రభుత్వసంస్థలకు రక్షణ బాధ్యతలను చూస్తున్నదన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి ఎన్టీపీసీకి సేవలందించాలని చందన్‌కుమార్ కోరారు. రేజింగ్ డే సందర్భంగా బ్యారక్స్ (సీఐఎస్ఎఫ్‌టౌన్‌షిప్)లో జవానులు పరేడ్ నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. సీఐఎస్ఎఫ్ రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ ముఖేష్ కుమార్, డిప్యూటీ కమాండెంట్లు ఆంజనేయరాజు, శాస్త్రి, అధికారులు, జవానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్, సీఐఎస్ఎఫ్ అధికారులు

బీసీలకు అవకాశం కల్పించడం అభినందనీయం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీలు బలహీనవర్గాల నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీట్లు కేటాయించడం అభినందనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే ఎఫెక్ట్ కారణంగానే బడుగు, బలహీన వర్గాల వారికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అవకాశం దక్కిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రాజరాజేశ్వరి గౌడ సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇతర దాతలతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే ఎఫెక్ట్‌తోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు బీసీ నాయకులకు పోటీ చేసే అవకాశం లభించిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ మూడు పార్టీలు ఐదుగురు బడుగు, బలహీన వర్గాలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడానికి బీసీ మంత్రిగా స్వాగతం తెలుపుతున్నానని అన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి 42 శాతం రిజర్వేషన్లు సాధించడంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఎదగాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు 200 కోట్ల రూపాయల చొప్పున 55 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు 11 వేల కోట్ల రూపాయలు మంజూరు చేయడం సంతోషకరమైన విషయమని, ఇది విప్లవాత్మకమైన నిర్ణయం అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు చేసి నందుకు సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతు న్నానన్నారు. బలహీనవర్గాలకు చెందిన నాయకులకు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడంపై అన్ని పార్టీల నాయకత్వాలకు పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం ట్రస్టు ప్రతినిధులు, నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరీక్షా కాలం.. ప్రణాళిక ముఖ్యం

- ముందస్తు సన్నద్ధతే కీలకం
- వార్షిక, ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు
- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు





గణేశ్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇది పరీక్ష కాలం. వార్షిక పరీక్షలతోపాటు పైచదువుల ప్రవేశ పరీక్షల కోసం సిద్ధమయ్యే సమయం. పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికతో ముందుకెళ్లడం కీలకం. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 నుంచి పదోతరగతి పరీక్షలు మొదలవనున్నాయి. డిగ్రీ వార్షిక పరీక్షలకు తోడు ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షల తేదీలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. కోరుకున్న విద్యా సంస్థలు, కోర్సుల్లో చేరాలనే లక్ష్యంతో చదువుతున్న విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వార్షిక, ప్రవేశ పరీక్షల్లో రాణించేందుకు సమాయత్తమవ్వాలి. అయితే వార్షిక పరీక్షల పాఠ్యాంశాల కంటే అర్హత పరీక్ష ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఇష్టమైన కోర్సు, ఆసక్తి గల కళాశాలల్లో సీటు దక్కాలంటే ప్రతిక్షణం విలువైనదిగా భావించాలి. అప్పుడే విద్యార్థుల కల సాకారం అవుతుంది. పోటీ పరీక్షల్లో సరైన సమయంలో సరైన సమాధానం గుర్తించిన వారే విజేతగా నిలుస్తారు. ఇందుకోసం పోటీ పరీక్షలకు మరింత కష్టపడి చదవాల్సి ఉంటుంది.

కీలక అంశాలు

కొన్ని ప్రవేశ పరీక్షల్లో మినహా విధిగా జనరల్ నాలెడ్జ్ పరీక్షిస్తారు. అందుకే అభ్యర్థి గత ప్రశ్న పత్రాలను పరిశీలించి ప్రశ్నల సరళిపై ఒక అంచనాకు రావాలి. ఒక మార్కు కోసం నాలుగు సమాధానాలు గుర్తించడం, జతపర్చడం వంటి ఎక్కువ ప్రశ్నలు తక్కువ మార్కులు అనే విషయాన్ని గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన, అంతర్జాతీయ సదస్సులు, రాజ్యాంగ సవరణలు, తెలంగాణ ప్రభుత్వ విధానాలు, వర్తమాన అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను గుర్తించాలి. ఇదే కాకుండా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలు అధిక సమయాన్ని తీసుకుంటే మిగతా వాటికి సమాధానాలు గుర్తించే అవకాశం కోల్పోయినట్లే. అయితే సమయ నిర్వహణ ఎంతో కీలకం. పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలి. సరైన నిద్ర, ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

ఇలా చేస్తే ప్రయోజనం

తొలుత ప్రతీ అంశంపై పట్టు సాధించేలా చదవాలి. అర్థం కానివి, పూర్తిగా కఠినమైనవి వదిలి మిగతా అంశాలను వంద శాతం అర్థవంతంగా చదవాలి. రోజులు గడుస్తుంటే పరీక్ష సమీపిస్తుందనే భయం ఉంటుంది. సిలబస్ ప్రకారం ఉత్తమ అంశాలపై ఒక అవగాహన వచ్చిన తర్వాత, పునఃశ్చరణ, సాధన వంటివి ఒక క్రమ పద్ధతిలో అనుసరిస్తే ప్రయోజనం కలుగుతుంది.

- ఉదయం 5 గంటలకు నిద్రలేవాలి.
- 6 నుంచి7 గంటల వరకు గత రాత్రి చదివిన అంశాలను రివిజన్ చేసుకోవాలి.
- 7 నుంచి 10 గంటల వరకు కఠిన అంశాల పఠనం.
- 10 నుంచి 12 గంటల వరకు గ్రూప్ డిస్కషన్.
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 వరకు సందేహాల నివృత్తి అనుభవజ్ఞుల సలహాలు, నిపుణుల శిక్షణ.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గత పరీక్షల ప్రశ్న పత్రాల సాధన.
- సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు అప్పటి వరకు చదివిన అంశాలను మననం చేసుకోవడం.
- రాత్రి 10 నుంచి 11 గంటల వరకు మరోసారి చదవాలి.



సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి

డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



ప్రతీ అంశాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి, కాన్సెప్ట్ అర్థం చేసుకోవడంపై దృష్టి సారించాలి. ప్రణాళిక బద్ధమైన అధ్యయనంతోపాటు సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి. ప్రతి రోజు ఒక నిర్దిష్టమైన సమయంలో చదవాలి. నిరంతర అభ్యాసనం జీవితంలో ఎల్లప్పుడూ అవసరం. దాని ద్వారా కొత్త విషయాలు నేర్చుకుంటాం.

స్వీయ అధ్యయనం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

డాక్టర్ ఎం.కల్పన, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల.



విద్యార్థులు కోచింగ్ తరగతులకు హాజరైనా ఎల్లప్పుడూ స్వీయ అధ్యయనానికి కట్టుబడి ఉండాలి. స్వీయ అధ్యయనం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వారి బలహీనతలు తెలుసుకోవడానికి సహాయపడుతుంది. స్వీయ అధ్యయన సమయాల్లో పునఃశ్చరణ చేసి నిర్ధారించుకోవాలి. ప్రణాళికాబద్ధంగా వ్యూహాన్ని అనుసరించాలి.

పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధం కావాలి

డాక్టర్ ఎన్.మనోజ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్



విద్యార్థులు అకడమిక్ పరీక్షలకుగానీ, పోటీ పరీక్షలకుగానీ సమర్థవంతంగా సన్నద్ధం కావాలి. పరీక్షా సరళిని, సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకోవాలి. వివరణాత్మక అధ్యయన ప్రణాళికను రూపొందించాలి. గత ప్రశ్నపత్రాలు, మాక్ పరీక్షలతో సాధన చేయాలి, పాఠ్యాంశాలు పూర్తిగా చదవడంతోపాటు పునఃశ్చరణకు సమయం కేటాయించాలి, చాలాసార్లు పునఃశ్చరణ చేయడంతో పరీక్షల్లో చేసే చిన్న చిన్న తప్పులను అధిగమించవచ్చు.

పరీక్షల షెడ్యూల్

- ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఎప్‌సెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ).
- మే 2 నుంచి 5 వరకు ఎంసెట్ (బీటెక్).
- మే 2న ఈసెట్(బీటెక్, బీఫార్మసీలోకి లేటరల్ ఎంట్రీ).
- జూన్ 1న ఎడ్‌సెట్.
- జూన్ 6న లాసెట్ (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం).
- జూన్ 8,9 ఐసెట్ (ఎంబీఏ, ఎంసీఏ).
- జూన్ 16, 19న పీజీఈసెట్ (ఎంటెక్, ఎంఫార్మసీ).
- జూన్ 11,14 తేదీల్లో పీఈసెట్ (డీపీఎడ్, బీపీఎడ్).



శివకల్యాణ వేడుకలకు సిద్ధం

- 17న స్వామివారి దివ్యకల్యాణానికి ఏర్పాట్లు
- ఐదు రోజులపాటు కల్యాణ వేడుకలు



వేములవాడ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీపార్వతిపరమేశ్వరుల కల్యాణ వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 17వ తేదిన సోమవారం ఉదయం 10.40 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ముందు భాగంలో స్వామివారి దివ్యకల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు ఐదు రోజులపాటు శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. కాగా 19న బుధవారం సాయంత్రం 3.05 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆర్జిత సేవలు రద్దు..

శివకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని 16వ తేది నుంచి 20వ తేదీ వరకు రాజన్న ఆలయంలో భక్తులు జరిపించుకునే నిత్య కల్యాణం, లింగార్చన, సత్యనారాయణ వ్రతము, అభిషేకములు, అన్న పూజ, సేవల టికెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. 17వ తేది శివకల్యాణం రోజున నిత్యచండీ సహిత రుద్రహోమం టికెట్లు రద్దు చేశారు. అంతే కాకుండా శివకల్యాణోత్సము సందర్భంగా 16వ తేది ఆదివారం కోడె మొక్కులు రాత్రి 11.30 గంటల వరకు కొనసాగుతాయని, 17వ తేదిన సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కోడె టికెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. తిరిగి శివకల్యాణం అనంతరం భక్తులకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు టికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రేపే కామదహన ఉత్సవం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం కామదహన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీన బుధవారం సాయంత్రం ప్రదోషపూజ అనంతరం కామదహన ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. కామదహన ఉత్సవాలను ఈనెల 12త తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు స్వామి కల్యాణ మండపంలో డోలా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రెండు తలలతో కోడిపిల్ల జననం



మల్యాల, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): మల్యాల మండలంలోని కొండగట్టులో కోడిపిల్ల రెండు తలలతో జన్మించింది. సిక్కుల శారద అనే మహిళ కొన్ని రోజుల క్రితం కోడి గుడ్లను పొదిగేసింది. సోమవారం వాటిని చూడగా అందులో ఒకటి రెండు తలలతో జన్మించిన కోడిపిల్ల కనిపించింది. అయితే కాసేపటికే ఆ కోడిపిల్ల మృతి చెందింది. జన్యులోపంతోనే కోడిపిల్ల రెండు తలలతో జన్మించిందని వెటర్నరీ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం

- భక్తులతో కిక్కిరిసిపోయిన క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం
- కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న సేవలో మంత్రి పొన్నం ప్రభాకర్



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయా యి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం కోడె మొక్కు క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ధర్మ దర్శనం, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని రాజ రాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

రాజన్నకు అత్యంత ప్రీతికరమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం గండా దీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని భీమేశ్వర స్వామి ఆలయంలో అభిషేక పూజలు చేశారు. బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం రాజన్న ఆల యానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కోడెపూజతోపాటు ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. కాగా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చింతామణి చెరువు వద్ద పుట్ట బంగారం కోసం స్వామి వారలకు ప్రత్యేక పూజలు

పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవలు ఊరేగింపు

ధర్మపురి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉద యం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండి తులు, అర్చకులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్త మాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆలయం పక్కాన ఈవో అర్చకులకు దీక్షా వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు.

సాయంత్రం లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవ మూర్తులను సేవలపై ఆశీనులు చేసి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకు వెళ్లారు. చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్ద సేవలను ఉంచి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకు వచ్చారు. స్వామి వారలకు కరీంనగర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

అలాగే శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన వెన్నెం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు కలిసి మూడు లక్షల విలువ గల మూడు కిలోల వెండితో తయారు చేయించిన శంఖు, చక్రం, ముంజేతులు ఆభరణాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగన భట్ల దినేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు. ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి భారీ బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ మఠం స్థలంలో గల యాగశాల వద్ద నూతన కల్యాణ వేదికపైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి 10 గంటల నుంచి శ్రీ ముదపాక బాల సుందరం భాగవతార్‌చే హరికథ కాలక్షేపం ఉంటుం దని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.





పుట్ట బంగారం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, బ్రహ్మోత్సవాల కోసం ఆలయానికి వస్తున్న భక్తులు, ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, స్థానికులు

కొండగట్టులో ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు వేకువజామున తిరుమం జనము, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవిత్రాహ్వానము, పుణ్యాహవాచనము, రక్షాబంధనం, రుత్విక్‌వరుణం, యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతార్చన, అగ్ని ప్రతిష్ఠ, హవనం, శ్రీ స్వామి వారికి అభిషేకం, అర్చన, మహ నివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంకాలం శ్రీ విష్ణు సహస్ర నామ, హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. అనంతరం స్థాపిత దేవతారధన, హవనం, పవిత్రలకు జలాధివాసం, ధాన్యాధివాసం, బలిహరణం, వేదసదస్యం, మంత్ర పుష్పం, శాత్తుమొర, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు సామూహిక భజనలు, రామనామ సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సుల్తానాబాద్, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు హోమాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎదుర్కొళ్ల ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అందరూ ఊరేగింపుగా వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకొని కల్యాణం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, ఆలయ చైర్మన్ పల్లా మురళి, డైరెక్టర్లు, పుర ప్రముఖులు,భక్తులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ..

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్


కలెక్టరేట్‌కు వచ్చిన పెద్దూర్ డబుల్ బెడ్‌రూంవాసులు


కలెక్టరేట్‌కు వచ్చిన తంగళ్లపల్లి మండల ట్రాక్టర్స్ అసోషియేషన్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో విన్నపాలు వెల్లువెత్తాయి. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీఆర్‌డీవో శేషాద్రి, సిరిసిల్ల ఇన్‌చార్జ్ ఆర్డీవో అర్పీ రాధాబాయిలు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 153దరఖాస్తులు, ఫిర్యాదులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు62, సిరిసిల్ల మున్సిపాల్టీకి 22, సెస్‌కు 3, ఉపాధి కల్పనశాఖకు 11, భూగర్భశాఖకు 5, జిల్లా వైద్యాధికారికి 3, వ్యవసాయశాఖకు 2, ఎల్‌డీఎంకి 1, వేములవాడ దేవస్థానం ఈవోకు1, జిల్లా పౌరసరఫరాల శాఖకు 2, జిల్లా సంక్షేమాధికారికి 8, డీపీఆర్‌ఈకి 2, ఎస్డీసీకి 3, విద్యాశాఖకు 5, గంభీరావుపేట ఎంపీడీవోకు 3, ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోకు 2, కోనరావుపేట ఎంపీడీవోకు 2, చందుర్తి ఎంపీడీవోకు2, ఎస్సీ కార్పొరేషన్‌కు 3, వేములవాడ మున్సిపాల్టీకి 2, వేములవాడ రూరల్ ఎంపీడీవోకు 1, బోయినపల్లి ఎంపీడీవోకు1, తంగళ్లపల్లి ఎంపీడీవోకు1,ముస్తాబాద్ ఎంపీడీవోకు1, ఎస్పీ కార్యాలయానికి 1, సీపీవోకు1, చేనేత జౌళిశాఖకు1, నీటిపారుదల శాఖకు 1 చొప్పున వచ్చిన ఫిర్యాదులు వినతి పత్రాలు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చూపావడంతోపాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం అధికారిని తొలగించాలి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి అథారిటీలో ఉన్న ముస్లిం అధికారిని విధులను తొలగించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రాన్ని అందించారు. దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారన్నారు. దీని పరిధిలో జిల్లా మొత్తాన్ని పరిగణంలోకి తీసుకున్నారన్నారు. హిందువులు భక్తిశ్రద్ధలతో పూజించే రాజన్న అలయానికి సంబంధించిన అభివృద్ధి అథారిటీలో ముస్లిం అధికారిని నియమించడంతో హిందువుల మనోభావాలు కించపరిచే విధంగా ఉన్నాయని ఈ అధికారిని తొలగించాలని కోరారు. అలాగే సిరిసిల్ల పట్టణంలోని వివిధ వార్డులల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఅర్‌లను తాజా మాజీ కౌన్సిలర్‌ల ఇళ్లలోనే ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలి..

- సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్,



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో మానేరు వాగు నుంచి ఇసుకను రాత్రిపూట అక్రమంగా రవాణా చేస్తున్నారని దీనిని అరికట్టాలి. గత కొన్ని నెలలనుంచి రాత్రిపూట మానేరు వాగు నుంచి గ్రామానికి చెందిన కొంత మంది ఇసుకను అక్ర మంగా రవాణా చేసి గ్రామాశివారులోని బైపాస్ రోడ్డులో నిల్వలు చేసి అమ్ముకుంటున్నారు. దీనిపై పోలీస్‌లతోపాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో 15 రోజుల క్రితం అక్రమ ఇసుకను రవాణా చేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. అయినా కూడా ఇసుక స్మగ్లర్లలో మార్పులు రావడం లేదని గ్రామంలోని ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరా లు ఏర్పాటుచేసి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలి.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

- సోమిశెట్టి దశరథం, సిరిసిల్ల



సిరిసిల్ల పట్టణంలోని పలు అసుపత్రుల్లో సర్టిఫికేట్‌లు లేకుండా డాక్టర్‌లుగా చలామణి అవుతూ ప్రజలకు వైద్యం అందిస్తున్నారని దీనిపై వైద్య శాఖ అధికారులు దృష్టి సారించి సర్టిఫికేట్‌లు లేకుండా వైద్యం చేస్తున్న వైద్యులతోపాటు ప్రైవేటు ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి కాపాడాలి.

వట్టెంల చెరువులను నీటితో నింపాలి

- గుడిసె విష్ణువర్ధన్, మాజీ సర్పంచ్, వట్టెంల



వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలో చెరువుల్లోకి గోదావరి జలాలతో నింపాలి. గ్రామంలోని రొంపి, పామిరెడ్డి చెరువుల కింద దాదాపు 500 ఎకరాల సాగు భూమి ఉంటుందని దానికి కింద ఉన్న బోర్లు, బావులు నీళ్ల లేక ఎండిపోవడంతో ప్రస్తుతం సాగు చేసిన పంటుల నీళ్ల లేక ఎండిపోతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. కలెక్టర్ స్పందించి ఈ చెరువు ల్లోకి డీ6, డీ7 కెనాల్‌ల ద్వారా నీటిని నింపి రైతులను అదుకోవాలి.

పెద్ద కూతురు పట్టించుకోవడం లేదు

- సంధి మల్లమ్మ, వల్లంపట్ల, ఇల్లంతకుంట



ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాకు ఉన్న ఆస్తిని ఇద్దరు కుమార్తెలకు సమానంగా పంపిణీచేశాను. వృద్యాపంలో ఉన్న నన్ను నా కుమార్తెలు ఆస్తి తీసుకుని పోషించకపోవడంతో నేను సీనియర్ సిటిజన్స్‌లో ఫిర్యాదు చేస్తే నా ఇద్దరు కుమార్తెలను పిలిపించి నా పోషణ కోసం ప్రతి నెల రూ 3 వేల చొప్పున ఇద్దరు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. అయితే నా చిన్న కుమార్తె మాత్రమే డబ్బులు చెల్లిస్తుందని నా పెద్ద కూమార్తె ఇవ్వడంలేదని, ఆమెపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

రాజేశ్వర్‌రావు కాలనీలో నీటి ఎద్దడి తీర్చాలి

- పిట్ల సతీష్, రాజేశ్వర్‌రావుకాలనీ, గంభీరావుపేట



గంబీరావుపేట మండలం రాజేశ్వర్‌రావు కాలనీలో నీటిఎద్దడితో ప్రజలందరు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రజలకు నీటిని అందించే బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడింది. మిషన్ భగీరథ నీళ్ల కూడా సక్రమంగా రావడంలేదు. దీంతో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ స్పందించి గ్రామంలో కొత్త బోర్‌తోపాటు మోటార్‌లను మంజూరుచేసి ఇబ్బందులు తొలగించాలి.

ఇసుకకు అనుమతులు ఇప్పించాలి..

తంగళ్లపల్లి మండలంలో ఇసుక రవాణాకు అనుమతులను ఇప్పించాలంటూ తంగళ్లపల్లి శ్రీలక్ష్మీనర్సింహ ట్రాక్టర్ ఓనర్స్ వేల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝూను కలిసి వినతిపత్రాన్ని అందించారు. మండలంలో 200 ట్రాక్టర్‌లు ఉన్నాయని తమకు సిరిసిల్ల మానేరు వాగునుంచి వే బిల్లులను ఇవ్వడం వలన ఇసుకను రవాణాచే యడం ఇబ్బందిగా ఉండడంతోపాటు సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. 15 సంవత్సరాలుగా మండల కేంద్రంలోనే వేబిల్లులు తీసుకోని ఇసుకను రవాణాచేస్తున్నామని కలెక్టర్ స్పందించి తంగళ్లపల్లి మండల కేంద్రంలోనే ఇసుకవేబిల్లులను ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుంజె గోపాల్, ద్యారంగుల ఎల్లయ్య, అలకుంట దుర్గయ్య, శివరాత్రి ఐలయ్య, మంజుల రాజు, పసువుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దూర్ డబుల్ బెడ్‌రూముల్లో సమస్యలు పరిష్కరించాలి..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో గత ప్రభుత్వం నిర్మించి అందించిన డబుల్ బెడ్‌రూంల కాలనీ సమస్యలను ఎవరు పట్టించకోకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెద్దూర డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూను కలిసి సమస్యలను వినతి పత్రాన్ని అందించారు. పెద్దూర్ డబుల్ బెడ్‌రూం కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపైన ఎలాంటి అనుమతులులేకండా డబ్బాను ఏర్పాటు చేయడంతో బైపాస్‌రోడ్డుపై వెళ్లుతున్న వాహనాలు గమనించకపోవడంతో కాలనీ నుంచి వెళ్లే వారు ప్రమాదాలకు గురైతున్నారు.దానిని తొలగించడంతోపాటు కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతోపాటు సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రచ్చ రాహుల్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే నసీర్, ప్రధాన కార్యదర్శి భూక్య సురేష్‌నాయక్, కోశాధికారి మంచికట్ల మల్లికార్జున్, వీరబత్తిని అశోక్, కొండ ఉపేందర్, వడ్డెపల్లి శ్రీకాంత్, అకుల రమేష్, బూర అంబరీషం, బొల్లబత్తిని పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


గోడు వెల్లబోసుకుంటున్న బాధితులు

మహిళా సంఘాలకు త్వరలో కొత్త సారథులు

(5వ పేజీ తరువాయి)

అధ్యక్ష, ఉపాధ్యక్షు లే కీలకంగా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల సభ్యులు కోట్ల రూపాయల్లో లావాదేవీలు జరుపుతున్నారు.

జిల్లాలో 1.15 లక్షల మంది సభ్యులు..

జిల్లాలో 411 గ్రామైక్య సంఘాలు, 9,854 పొదుపు సంఘాల్లో 1,15,656 మంది సభ్యులు ఉన్నారు. 154 దివ్యాంగుల పొదుపు సంఘాలు ఉండగా, 1,194 మంది సభ్యులు ఉన్నారు. మండల సమాఖ్యలు 12, జిల్లా సమాఖ్య 1 పనిచేస్తోంది. ఈ సంఘాలకు నూతన మ్యాక్స్ చట్టం ప్రకారం ఎన్నికల నిర్వహణలో గ్రామంలో స్వయం సహాయక సంఘాల్లో సాధారణ సభ్యులు కూడా గ్రామైక్య, మండల, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అయ్యే అవకాశం ఉంది. గతంలో స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాళ్ల నుంచే గ్రామైక్య సంఘం అధ్యక్షురాలిగా ఎన్నుకునేవారు. గ్రామైక్య సంఘం అధ్యక్షుల నుంచి మండల సమాఖ్య, మండల సమాఖ్య అధ్యక్షరాళ్లతో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిని ఎన్నుకునేవారు. నూతన నిబంధనల ప్రకారం రెండు, మూడు సంఘాలతో ఒక నియోజకవర్గంగా ఏర్పాటుచేస్తారు. ఈ సంఘాల సభ్యుల్లోంచి 10 నుంచి 12 మందితో రిజర్వ్ జనరల్ బాడీ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ సభ్యుల్లోంచి కార్య నిర్వహణ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ సభ్యుల్లోంచి అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులను పీఎస్‌టీలను నియమిస్తారు. ఇదే విధానాన్ని మండల, జిల్లా సమాఖ్యల్లోనూ అనుసరిస్తారు. సంఘాల్లో ఐదుగురు, మండల జిల్లా సభ్యుల్లో ముగ్గురి చొప్పున పీఎస్‌టీలను ఏర్పాటు చేస్తారు. వీరి పదవీకాలానికి సంబంధించి గ్రామైక్య సంఘాలకు ఐదేండ్లు, మండలం, జిల్లా సమాఖ్యలకు మూడేళ్లు ఉంటుంది. ఈ ఎన్నికలను మార్చి లోగా పూర్తి చేసే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. గ్రామైక్య సంఘాల్లోని సభ్యుల్లో ఎన్నికల సందడితో పోటీకి సిద్ధమవుతున్నారు.

సమర్థవంతమైన సేవలందించడమే లక్ష్యం

సిరిసిల్ల క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని ఎస్పీ మహేశ్.బి. గితే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా 10 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారినికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలందిస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

రుద్రంగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివారులో మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో ఉన్న మల్లికార్జున స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని పునర్ నిర్మించడానికి గ్రామస్తుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎన్నారై బొల్లి కుమార్, ఇప్ప మహేష్, బొల్లి దేవేందర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

చందుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు తీసుకువచ్చి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గంగాధర రమేష్, శంకరయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

వీర్నపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, హౌసింగ్ డిఈ భాస్కర్, ఎమ్మార్వో మారుతిరెడ్డి, ఎంపీడీవో వాజిద్, హౌసింగ్ ఏఈ హమీద్, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారంలో మూడు నెలలక్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న దూస వెంకటేష్(37) మిత్రులు ఆదివారం బాధిత కుటుంబానికి చేయూతనందించారు. ఇద్దరి కూతుర్ల పేరు మీద పోస్ట్ ఆఫీస్‌లో రూ.40వేలు ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్‌ను అందజేశారు. భవిష్యత్తులో పిల్లల చదువు కోసం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 2005-06 టెన్త్ బ్యాచ్, గౌరీపుత్ర యూత్ సభ్యులు, మిత్రులు అందరూ కలిసి వాట్సాప్ ద్వారా విరాళాలు సేకరించి వారికి అందజేశామని తెలిపారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

గంభీరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వెంటనే చట్టబద్దత కల్పించాలని గంభీరావుపేటలో ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో సోమవారం డప్పుల దరువుతో నిరసన కార్యక్రమంలో భాగంగా మెయిన్ రోడ్ వెంట వెళ్ళి తహసీల్దార్ భూపతికి వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బర్కుటం తిరుపతి, ప్రధాన కార్యదర్శి నరేష్‌వర్మ, ఉపాధ్యక్షులు జోగు జగన్, కళ్యాణ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మహేందర్. స్వామి, ప్రశాంత్, ప్రవీన్, అనిల్, భూపతి, లక్ష్మన్. గొల్లపల్లి తిర ఎపతి తదితరులు ఉన్నారు.

రైతులపై కక్షగట్టిన ఎమ్మెల్యే 'కవ్వంపల్లి'

- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


సమావేశంలో మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రైతులపై కక్షగట్టిన ఎమ్మెల్యే సత్యనారాయణ తన వైఖరిని మార్చుకోవాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగనాయకసాగర్ నుండి సాగు నీరు కావాలని రైతులు నిరాహారదీక్ష చేస్తుంటే ఎమ్మెల్యే వారిని కనీసం కలిసే సమయం లేదా అని ప్రశ్నించారు. ఇల్లంతకుంటలో బాడీఫ్రీజర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎందుకు సమస్య పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం ఫారెస్టు క్లియరెన్స్ లేకనే కాలువ పనులు నిలిచిపోయాయన్నారు. రూ1.25కోట్లు కేటాయిస్తే కాలువ పనులు పూర్తి అవుతాయన్నారు. నిధుల మంజూరు ఎమ్మెల్యేతో కాకపోతే ఆర్థికశాఖ మంత్రిని తాను కలిసి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్న సహకార సంఘ అధ్యక్షులను ఎందుకు తొలగించారో ప్రజలకు వివరించాలన్నారు. జిల్లాలో అన్ని సంఘాల అధ్యక్షులకు గడువు పెంచి కేవలం ఇల్లంతకుంట మండల అధ్యక్షులను తొలగించి పర్సన్ ఇంచార్జీలను నియమించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతులు గత ప్రభుత్వంలో ఏనాడు రైతులు నిరసన తెలుపలేదన్నారు. రైతుబంధు, రుణమాఫీ అందక రైతులు ఇబ్బందిపడుతున్నారని, మార్పు అంటే ఇదేనా అని అన్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా సాగునీటి అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని లేనట్లయితే రైతులతో కలిసి బీఆర్ఎస్ ఉద్యమాలు కొనసాగిస్తుందన్నారు. కమీషన్లపై ఉన్న ప్రేమ కాలువల నిర్మాణాలపై చూపెట్టాలన్నారు. సమావేశంలో మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, నాయకులు సాదుల్, దేవేందర్‌రెడ్డి, గొట్టెపర్తి పర్శరాం, కొట్టె వెంకన్న, అంతగిరి భాస్కర్, దయ్యాల మహేష్, మధు, దుర్గయ్య, బాలగౌడ్, రాములు, హరికుమార్, పర్శరాం, సతీష్, నరేష్‌కుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, బాగయ్య, నర్సయ్య, రాజు, బలరాం, దేవయ్య పాల్గొన్నారు.

బీసీ సాధికారత సంఘం బలోపేతానికి కృషి

- ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్


సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పొలాస నరేందర్

సిరిసిల్ల టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ సాధికారత సంఘం బలోపేతానికి కృషిచేయాలని బీసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో బీసీ సాధికారత సంఘం జిల్లా కార్యాలయంను ముఖ్య అతిథి పొలాస నరేందర్ ప్రారంభించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిరిసిల్ల పట్టణ, పట్టణ యువజన, పట్టణ మహిళా బీసీ సాధికారత సంఘాల కమిటీలను నియమించి నియామకపత్రాలను నరేందర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల జనాభా ప్రాతిపదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నిరంగాలలో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రకారం బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ పరంగా ఎదుగుదల కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల శేఖర్ గౌడ్ మాట్లాడారు. బీసీల జనాభా ప్రకారం చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గత ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారత సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకుంట వెంకటేశం, పద్మ, ఆడెపు చంద్రకళ, సంఘం పట్టణ అధ్యక్షుడు గుజ్జె శివరాం, పట్టణ ప్రధాన కార్యదర్శి జక్కని రవి, యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు అన్నారపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెల్దండి సాయికృష్ణ, సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలు గుజ్జె తార, మహిళ పట్టణ అధ్యక్షురాలు వంకాయల కావ్య, ప్రధాన కార్యదర్శి కొత్వాల్ ప్రమీల, ఉపాధ్యక్షురాలు చింతకుంట పద్మ, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, నాయకులు గోశిక శ్రీనివాస్, కందుకూరి రామాగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో విక్రమ్

గంభీరావుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేటకు చెందిన సైమా ఆకాడమీ క్రీడాకారులు గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. పెద్దపల్లి ఎంబీ గార్డెన్స్‌లో జరిగిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో 18 బంగారు, 1 వెండి పథకాలు సాధించి గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌ని కైవసం చేసుకున్నారని చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ విక్రమ్ తెలిపారు. పథకాలు సాధించిన క్రీడాకారులను కరీంనగర్ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, గ్రాండ్ మాస్టర్ విద్యాసాగర్, చీఫ్ ఆర్గనైజర్ యాదగిరి, యోగ కోచ్ దేవయ్య, అథ్లెటిక్స్ కోచ్ జంపన్న, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు అభినందించారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలోని దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు నిమ్మల సాన్వి, నిమ్మల లోహిత, నిమ్మల రిత్విక, నిమ్మల ధనుజ్ఞ, సల్మాల అర్పితలు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం గంగయ్య సోమవారం తెలిపారు. విద్యార్థినులను పలువురు అభినందించారు. కరాటే మాస్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చందుర్తి : జాతీయస్థాయి కరాటే పోటీల్లో బాలికలు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు స్పార్క్ కుంగ్‌ఫూ ఇన్‌స్ట్రక్టర్ నేరెళ్ల శ్రీధర్‌గౌడ్ తెలిపారు. మూడపల్లి, నర్సింగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు 12గోల్డ్, 5 సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మల్లేశం, జితేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరోపణలు మానుకోవాలి..

తంగళ్లపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అసత్య ఆరోపణలు.. వ్యక్తిగత దూషణలు మానుకోవాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాట్ల మధు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లడుతూ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ వ్యక్తిగత దూషణలు చేయడాన్ని ఖండించారు. వ్యక్తిగత దూషణలు మానుకోవాలని అధికార పక్షంలో ఉండి అభివృద్ధి, ప్రజలకు చేసిన సేవలు చెప్పుకోవాలని, కాని ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రెస్‌మీట్‌లు పెట్టడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు బండి జగన్, సిలివేరి చిరంజీవి, కడారి నవీన్‌రెడ్డి, గుండు ప్రేమ్‌కుమార్, అమర్‌రావు, కొమురయ్య, కృష్ణ, ముత్యంరెడ్డి, శ్రీకాంత్‌రావు, నరేశ్, జీవన్, తిరుపతి, లింగం, రమేశ్, మహేశ్, అఫ్రోజ్ తదిరులు పాల్గొన్నారు.

చేపల కోసం రెండు గ్రామాల మధ్య వివాదం..

వేములవాడ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో చేపలను పట్టుకునేందుకు రెండు గ్రామాల మత్స్యకార్మికుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మధ్యమానేరు బ్యాక్‌వాటర్ సంకెపల్లి శివారు వరకే ఉందని గ్రామ మత్స్యకార్మికులు, వేములవాడ పట్టణ శివారు వరకు నీరు ఉందని, చేపలు పట్టు కునేందుకు తమకు కూడా హక్కు ఉందని పట్టణ మత్స్యకార్మికులు గొడవకు దిగారు. విషయం జిల్లా ఫిషరీష్ అధికారి సౌజన్య దృష్టికి తీసుకువెళ్లారు. సంఘ టన స్థలానికి చేరుకున్న సౌజన్య సంబంధిత అధికారులతో మాట్లాడి హద్దులు ఏర్పాటుచేస్తామని మూడు రోజులపాటు సమయమానం పాటించాలన్నారు.

బూట్లు, నోటుపుస్తకాల అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాజా, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో రూ. 25వేల విలువైన షూ, నోటు పుస్తకాలను సోమవారం అందజేశారు. శంకరనాయక్ హెల్పింగ్ హ్యాండ్ పేరిట పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్, శంకర్‌నాయక్ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు రాజ్‌కుమార్, గణేశ్, నాయకులు భాస్కర్, భోజ్యానాయక్, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో ఇఫ్తార్ విందు

ఇల్లంతకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జామా మసీదులో ముస్లిలకు గంగాధర ఆలయ అర్చకుడు మూగు నాగరాజుశర్మ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్, రజతో పాటు ముస్లింలు పాల్గొన్నారు

కాంగ్రెస్ నాయకులను అభినందించిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం కలవగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బిగుల్ల విజయ్, నాయకులు యాస తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, వంశీధర్ రెడ్డి, మల్లేశం, లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నేడు 'రైతు నేస్తం' కార్యక్రమం

ఎల్లారెడ్డిపేట, మార్చి10(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని రైతు వేదికలో ఈనెల 11న రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌ను జరుగనుందని ఏఈవో అనూష ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి పంటలలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్షయ వ్యాధి నివారణకు చర్యలు

వీర్నపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనిత అన్నారు. మండలంలోని కంచర్ల గ్రామంలో సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. గ్రామంలో 40 మందికి క్షయ పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్నేహ, టిబి సూపర్‌వైజర్ షైపాల్, నోడల్ సూపర్‌వైజర్ పద్మ, ఎమ్ఎల్‌హెచ్‌పి స్నేహ, టీవీ కోఆర్డినేటర్ బిగిందర్, ఏఎన్ఎంలు రుతమ్మ, సుమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శివరాత్రి రవి కుటుంబానికి ఎన్ఆర్ఐ సురేశ్‌నాయక్ యువ సైన్యం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5 వేల నగదును సోమవారం అందజేశారు. దుబాయిలో ఉంటున్న సురేశ్‌నాయక్ ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకుని నగదును సమకూర్చారు. ఆయనకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయికుమార్‌నాయక్, వినోద్‌నాయక్, శంకర్, రాజునాయక్, లింగం, ప్రభాష్ తదితరులు పాల్గొన్నారు.